క్లుప్తంగా

రెండు పాఠశాలలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ పెద్దిరాజు

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురంలోని జేఎస్ పాఠశాలను, కొత్త సీతారాంపురంలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జి.పెద్దిరాజు, కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష‌బాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, రోలు , ఉపాధ్యాయులు హాజరు రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి తిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ జగనన్న గోరుముద్దల పథకంలో భాగంగా ఇచ్చిన మెనూ తప్పకుండా అమలు చేయాలన్నారు. మెనూ అమలు చేయని కుకింగ్ ఏజెన్సీల పై చర్యలు తప్పవన్నారు. వంటశాలను, వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేషబాబు, హెచ్‌ఎం యక్కంటి గోవిందరెడ్డి, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ గిరిజా, మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: వివాహ నమోదు చట్టంపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కల్గి ఉండాలని సబ్ రిజిస్ట్రార్ పి.గిరిజా అన్నారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ 2002 బాల్య వివాహాల నమోదు చట్టం పై అవగాహన కల్పించారు. న్యాయవాది బాలాజీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కిరణ్ పాల్గొన్నారు.

27న డాక్టర్ గుజ్జుల రవీంద్ర కనిగిరి రాక

కనిగిరి రూరల్: సీపీఐ జాతీయ నాయకుడు, దివంగత మాజీ ఎంపీ గుజ్జుల యల్ల మందారెడ్డి కుమారుడు, జర్మనీ దేశం అట్లాంటబర్గ్‌కు మేయర్‌గా పనిచేసిన డాక్టర్ గుజ్జుల రవీంద్ర సోమవారం కనిగిరికి రానున్నట్లు సీపీఐ కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుజ్జుల రవీంద్రాకు తొలుత స్థానిక ఒంగోలు బస్టాండ్ నందు ఉన్న సయ్యద్ హనీఫ్ స్థూపం ఉదయం 10.30 గంటలకు స్వాగత కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌లో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పామూరు బస్టాండ్ సెంటర్‌లో గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవిల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం గార్లపేట బస్టాండ్‌లో దర్శి చెంచయ్య భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మిత్రుల, శ్రేయోభిలాషుల సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం తర్వాత తన స్వగ్రామమైన పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి వెళ్లి స్థానికులతో ప్రజలతో మమేకమై అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

చురుగ్గా డబుల్ రోడ్డు పనులు



చురుకుగా ఎర్రవాగు బ్రిడ్జి పనులు



శరవేగంగా ఏనుగమంద వాగు బ్రిడ్జి పనులు

హనుమంతునిపాడు: కంభం–కనిగిరి రోడ్డు విస్తరణ డబుల్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు ప్రయాణికులు ఎన్నో ఏళ్ల నుంచి సింగిల్ రోడ్డు మీద ప్రయాణం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. దీంతో ప్రజల ఇబ్బందులు చెప్పేవీ కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు ప్రారంభించి శరవేగంగా జరుగుతుండంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏనుగ మంద వాగు, ఎర్రవాగు, కొండవాగు, చిన్న చిన్న కల్వర్టు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు డబుల్ రోడ్డు పనులు పూర్తయితే చెన్నై నుంచి వచ్చే వాహనాలు కూడా కర్నూలు, అనంతపూర్, నంధ్యాల, గుంతకల్లు ప్రాంతాలకు దూరం తగ్గుతుందంటున్నారు. భారీ వాహనాలు కూడా వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని చెబుతున్నారు. రోడ్డు పనులు వేగంగా జరుగుతుండంతో ప్రజలు ఆనందిస్తున్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సింగరాయకొండలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా



పొన్నలూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజారావు

సింగరాయకొండ: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలయోగి గురుకుల పాఠశాలలో శనివారం సాయంత్రం బాలికల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. దిశ యాప్‌ను ఆపద సమయంలో ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. విద్యార్థినులకు అన్యాయం జరిగితే నిరభ్యంతరంగా తన వద్దకు వచ్చి చెప్పాలన్నారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి...

పొన్నలూరు: ప్రతి విద్యార్థి దురలవాట్లకు దూరంగా ఉండి విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగాలని ఎస్సై దాసరి రాజారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసి చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా ఒకరికొకరు సోదర భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్ చేసినట్లు రుజువై కేసు నమోదు చేస్తే రూ. 25 వేల జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు అలాంటి పనులకు దూరంగా ఉండి చదువు, భవిష్యత్‌పై దృషి సారించి తల్లిదండ్రులు, గురువులు సూచించిన మార్గంలో నడుచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రషీద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్చి లోగా 100 పనిదినాలు పూర్తి చేయాలి



కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమణారెడ్డి

పీసీపల్లి: ఉపాధి హామీ పథకంలో 100 పనిదినాలు పూర్తి చేసుకొని వారు మార్చి లోగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తలకొండపాడు పంచాయతీలో చిలుకూరి పంచాయతీలో జరుగుతున్న డ్యాం పూడికతీత పనులు జరిగే ప్రదేశాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా కూలీలు ఉదయాన్నే 6 గంటలకు పనులకు రావాలన్నారు. కనీసం 4 గంటలు పనిచేసి రూ. 257 వేతనం పొందాలన్నారు. ప్రభుత్వం సూచించిన కొలతలప్రకారం పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాలకు ఉపయోగపడే సుస్థిరాస్తులను గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి గడ్డం రాంబాబు, టీఏలు సలీంబీ, ఎఫ్ఏ ఏ పార్వతమ్మ పాల్గొన్నారు.

టంగుటూరులో ఎగిరిన సర్వే డ్రోన్

టంగుటూరు: జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష రీసర్వేకు టంగుటూరు రెవెన్యూ గ్రామాలైన టంగుటూరు, జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం, అలకూరపాడు గ్రామాల్లో శనివారం డ్రోన్ ఎగిరింది. ఈ సందర్భంగా జిల్లా డ్రోన్ టీం సిబ్బంది విష్ణువర్ధన్ డ్రోన్ ఎగురవేసి సర్వేని ప్రారంభించారుర. సర్వే నిర్వహించి చిత్రాలు తీశారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 8 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ప్రారంభిస్తామన్నారు. డ్రోన్ సర్వే చేసి రైతులకు రికార్డులో నమోదు చేస్తామన్నారు. రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సింగరాయకొండ: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి చైతన్యకృష్ణ సూచించారు. స్థానిక బీసీ కాలేజీ బాలుర వసతి గృహంలో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వసతి గృహంలోని విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు జరిపారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, ఎంఎల్‌హెచ్‌పీ కుష్బూ, ఏఎన్ఎం నసీమున్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలం ఆక్రమణదారులకు నోటీసులు

పొన్నలూరు: పొన్నలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 264, 265, 266 సర్వే నంబర్లలో 10.37 ఎకరాల జెడ్పీ స్థలం ఉంది. ఈ స్థలంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు కొందరు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు రెవెన్యూ రికార్డుల ప్రకారం మూడు రోజుల క్రితం ప్రత్యేక సర్వే చేపట్టి జెడ్పీ స్థలానికి పూర్తిస్థాయిలో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అధికారికంగా, అనధికారికంగా జెడ్పీ స్థలం ఆక్రమించి ఇళ్లు నిర్మించిన వారికి కలెక్టర్ ఆదేశాల ప్రకారం నోటీసులు జారీ చేయడానికి ఈవోఆర్డీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి.రత్నజ్యోతి శనివారం తెలిపారు. ఈ నోటీసులు అందుకున్నవారు వారికి స్థల కేటాయింపు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన హక్కు పత్రాలను చూపించాలన్నారు. హక్కు పత్రాలు లేకున్నా, కేటాయించిన స్థలం కంటే ఎక్కువ స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించి ఉంటే సర్వే అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం



జామాయిల్ తోటలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

హనుమంతునిపాడు: మండలంలోని వేములపాడు గ్రామంలో రెండు ఎకరాల్లో జామాయిల్ తోట, వరిగడ్డి వాము దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కొడిదల చిన్న సుబ్బయ్యకు చెందిన 5 ఎకరాల జామాయిల్ తోటలో నిప్పు పెట్టడంతో 2 ఎకరాలు కాలి బూడిదైంది. అదే విధంగా బండ్లమూడి తిరుపతయ్యకు చెందిన వరిగడ్డి వాము దగ్ధమైంది. ఎవరో ఆకతాయిలు బీడీ కాల్చి వేయడంతో నిప్పు అంటుకొని ప్రమాదం జరిగిందని బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న కనిగిరి అగ్నిమాపక శాఖాధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో జామాయిల్ తోటకు రూ.లక్ష, వరిగడ్డి వాము రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాఫీ విత్ గృహసారథి



టంగుటూరులో కాఫీ విత్ గృహసారథిలో పాల్గొన్న అశోక్‌బాబు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన కాఫీ విత్ గృహసారధి కార్యక్రమం టంగుటూరులోని చెల్లెమ్మతోటలో గల గృహసారధి ఉన్నం సుజాత ఇంట్లో జరిగింది. శనివారం అశోక్‌బాబు గృహసారధి పరిధిలోని క్లస్టర్లో సమస్యలున్న వారితో మాట్లాడారు. గృహసారధిని, నాయకులను ప్రజలకు పరిచయం చేశారు. కష్టపడి పనిచేయడం అలవాటు చేసుకోవాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, రావి వెంకటేశ్వర్లు, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు టంగుటూరి రామకృష్ణ, కొమ్ము సురేంద్ర, వైఎస్సార్ టీఎఫ్ నాయకుడు సూదనగుంట వెంకటస్వామి, ఎంపీటీసీ ప్రభుదాసు, శిఖా సుబ్బారావు, తన్నీరు చిన్నవీరనారాయణ, దాసరి సుబ్బారావు, దుగ్గిరాల పేర్రాజు, కొమ్ము కోటేశ్వరరావు, పులిచర్ల కోటయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి తక్షణ ప్రణాళిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: తాత్కాలికంగా వచ్చిన నీటి సమస్యను రాజకీయ దురుద్దేశతో రాద్ధాంతం చేయడం సరైంది కాదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక చైర్మన్ చాంబర్‌లో శనివారం పాలకమండలి సభ్యులు, అధికారులు నీటి సమస్యపై సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాలతో కొంత మేర నీటి సమస్య ఉత్పన్నమైందని, పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యతగా నీటి అందించేందుకు అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలు సమస్యను గుర్తించి సహకరించాలన్నారు. ఎవరో చెప్పిన సలహాలతో రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్ సమస్యను సృష్టించి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని విన్నవించారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి సమస్య తీవ్రతను ఇప్పటికే గుర్తించామన్నారు. ఎక్కువ సమస్య తీవ్రత ఉన్న ప్రాంతాలకు తొలిప్రాధాన్యతగా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. వారం రోజుల్లో పూర్తిగా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, ఇందుకు పాలకమండలి, ప్రజలు సహకారం అందించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, మాణిక్యరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎస్‌బీ సీసీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్

పామూరు: ఉపాధ్యాయులు వారి పాఠశాల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఎస్‌బీసీసీ సెల్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం డి.రామిరెడ్డి అధ్యక్షతన సామాజిక పరివర్తన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీసీసీ సెల్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలశాల పరిధిలో డ్రాపౌట్స్ పిల్లలను సర్వే చేసి వారి తల్లిదండ్రులలో విద్య ఆవశ్యకతపై వివరించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అదే విధంగా బాల్య వివాహాల నిషేధచట్టం , బడిఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలనే విద్యాహక్కుచట్టం, మధ్యాహ్న భోజనంపై అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్ డి. హరిబాబు మాట్లాడుతూ బాల వివాహాలు చేసుకోవడం నేరమని, వాటి వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనతపై వివరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి బాల్యవివాహాల నిషేధం, కిశోరబాలికల గృహ సందర్శన, పాఠశాల సందర్శన గురించి చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వై.మోమిన్, వెంకట్రావు, అమీర్‌బాషా, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయాగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

పామూరు: మండలంలోని సిద్దవరం పొలాల్లో ఏఓ రాధ ఆధ్వర్యంలో శనివారం శనగలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాధ మాట్లాడుతూ శనగలో పంట దిగుబడిని అంచనా వేసేందుకు బీమా సంస్థ ప్రతినిధితో కలిసి పంటకోత ప్రయోగం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలద్వారా సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు, రైతుభరోసాతో ఆదుకోవడం ద్వారా సకాలంలో పంటలువేసి అధిక దిగుబడులు పొంది రైతులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలను ఆర్బీకేలద్వారా ప్రభుత్వం కొనుగోలుచేసి అన్నదాతలకు గిట్టుబాటు ధరలు కలిస్తూ దళారుల బారి నుంచి రైతులను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ రమేష్, బీమాసంస్థ ప్రతినిధి వంశీకిరణ్ పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

హనుమంతునిపాడు: నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షరీఫ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 14 గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 గ్రామ పంచాయతీ పరిధిలోని 14 సచివాలయాల్లో 42 శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారన్నారు. నూరుశాతం పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వెలిగండ్ల: విద్యార్థు భోజనం అందించాలని ఎంఈఓ దాసుప్రసాద్ అన్నారు. మండలంలోని రామగోపాలపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుమైన భోజనంతో పాటు, చిక్కీలు, రాగిజావ, కోడిగుడ్లు అందిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మున్ని, హెచ్‌ఎం కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈకైవేసీ పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ రమణ

పీసీపల్లి: మండలంలో పెండింగ్ ఉన్న పీఎంకిసాన్ ఈకేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని తలకొండపాడు ఆర్‌బీకేను శనివారం ఆయన పరిశీలించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలకొండపాడులో దాదాపు 125 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఈకేవైసీలో బ్యాంకు అకౌంటు లేని వారు దగ్గరలోని ఆధార్ లింక్‌తో పోస్టల్ ఖాతాలు తెరవాలన్నారు. వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

27 లోగా ఈ క్రాపు నమోదు చేసుకోవాలి

సీఎస్‌పురం: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 27వ తేదీ లోగా ఈ క్రాపు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కంచెం రాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27తో ఈ క్రాపు నమోదు వెబ్‌సైట్ ముగుస్తుందన్నారు. ఇటీవల కాలంలో వచ్చిన తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన జాబితాలో పేర్లు ఉన్న రైతులు అనేక మంది ఈ క్రాపు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రాపు నమోదు చేసుకుంటేనే పంట ష్ట పరిహారం అందుతుందని, కావున ప్రతి ఒక్కరూ ఈ క్రాపు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

నీరు అక్రమంగా విడుదల చేస్తే చర్యలు



నీటి ప్రవాహానికి అడ్డుకట్టవేయిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పామూరు: చెరువు నీటిని అక్రమంగా విడుదలచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ శ్రీను అన్నారు. పామూరు పాతచెరువు నీటిని గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల రాత్రివేళల్లో ఉద్దేశపూర్వకంగా నీటిని తూములద్వారా విడుదల చేస్తున్నారు. దీనిపై పలుమార్లు ఆయకట్టు రైతులు, ప్రజలు అధికారులకు విన్నవించడం, నిరసన కార్యక్రమాలు చేయడంతో ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు శనివారం నీరు వృథాగా పోతున్న తూములను పరిశీలించారు. స్థానిక రైతులు మరికొందరితో కలిసి నీటి వృథాను కొంతమేర అరికట్టారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో నీటి విడుదలను అరికడతామని ఏఈ శ్రీను తెలిపారు. ఆయకట్టులో పంటలసాగు లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు.

మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగింత

కనిగిరి రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ వీధిలోని రజక భవన్ సమీపంలో చనిపోయిన జె.పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన నూతలపాటి సురేష్ బాబు (39) మృతదేహాన్ని శనివారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ బి. పాపారావు తెలిపిన వివరాల ప్రకారం మృతదేహం ఉన్న ఇంటి తాళాన్ని శనివారం తల్లి దండ్రుల సమక్షంలో తెరచామన్నారు. కొంత అనారోగ్యంతో ఉన్న సురేష్, రాత్రి ఇంట్లో చదువుకుంటూ గుండెపోటుకు గురై మరణించి ఉంటారని తల్లి దండ్రులు తెలిపారన్నారు. సురేష్ మృతి చెంది మూడు, నాల్గు రోజులు కావడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు చెప్పారు. ఈమేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, సురేష్ మృత దేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.